ముషీరాబాద్ ఎక్సైజ్ స్టేషన్‌లో వాహనాల వేలం



వాహనాలను వేలం వేస్తున్న ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రావు

ముషీరాబాద్: ముషీరాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా గంజాయి, మద్యాన్ని అక్రమంగా రవాణా చేసి పట్టుబడిన వాహనాలను స్టేషన్‌లో వేలం వేశారు. ఎక్సైజ్ అసిస్టెంటు సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రావు, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణల పర్యవేక్షణలో 12 వాహనాలను వేలం వేశారు. ఈ వేలం పాటలో ఎక్సైజ్ శాఖకు రూ.1,96,980 వచ్చాయని వారు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పించాలి

కాచిగూడ: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని బీసీ విద్యార్థి సంఘం తెలంగాణ అధ్యక్షుడు వేముల రామకృష్ణ డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా వందల కొద్ది ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాఠశాలల్లో వసతులపై విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడిందని ఆయన ఆరోపించారు. ముఖ్యంగా పాఠశాలల్లో మూత్రశాలలు సరిగా లేవన్నారు. దీంతో బాలికలు చదువులు మానివేయాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయని తెలిపారు. పాఠశాలల్లో పిల్లలు కూర్చునే బెంచీలు కూడా సరిగా ఉండటం లేదని, మంచినీటి వసతి కూడా ఉండటం లేదన్నారు. త్వరలోనే పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో కనీస మౌలిక వసతులు ఏర్పాటు చేసి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు.

కష్టపడే వారికే పదవులు



చిక్కడపల్లి: రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీకి ఏఐసీసీ పొలిటికల్ ఎఫైర్స్ కమిటీలో అవకాశం లభించడం హర్షణీయమని టీపీసీసీ మహిళా విభాగం మాజీ ప్రధాన కార్యదర్శి పాక జ్ఞానేశ్వరి అన్నారు. ఈ సందర్భంగా ఆయనను కలసి పుష్పగుచ్ఛం అందజేసి శుక్రవారం సాయంత్రం సన్మానించారు. అనంతరం ఆమె గాంధీనగర్‌లో మాట్లాడుతూ... కాంగ్రెస్‌లో కష్టపడి పనిచేసే వారికి పదవులు వరిస్తాయని అన్నారు.

'గణపతి హోమం'

నల్లకుంట: డివిజన్ పరిధిలోని రత్నానగర్‌లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రత్యేక నిధులతో నిర్మించిన కమ్యూనిటీహాల్ పనులు పూర్తయ్యాయి. ఇటీవల కేంద్ర మంత్రి బస్తీలో పర్యటించి నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను పరిశీలించారు. ఈ క్రమంలో రత్నానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం కమ్యూనిటీహాల్‌లో 'గణపతి హోమం' నిర్వహించారు.

ఆత్మీయ వీడ్కోలు



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: వీఎస్‌టీ ఫంక్షన్‌హాల్‌లో తెలంగాణ రోడ్డు రవాణా సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గద్దం శ్రీనివాస్ ఉద్యోగ విరమణ, ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా టీఎస్‌ఆర్టీసీ ఈడీ మునిశేఖర్ మాట్లాడుతూ.. రోడ్డు రవాణా సంస్థ అభివృద్ధికి, కార్మికుల సంక్షేమానికి పాటుపడిన వ్యక్తి శ్రీనివాస్ అని కొనియాడారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు సమస్యల పరిష్కారానికి ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో జేబి రాజు, వెంకన్న, ఉషాదేవి, సత్యనారాయణ, రాజయ్య నాయక్, కృష్ణకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రివర్గ విస్తరణలో మున్నూరు కాపులకు అవకాశం కల్పించాలి

కాచిగూడ: తెలంగాణ మంత్రివర్గ విస్తరణలో మున్నూరుకాపులకు అవకాశం కల్పించాలని రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ అధ్యక్షుడు పిల్లి శ్రీనివాస్‌రావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం కాచిగూడలోని మహాసభ కార్యాలయంలో పిల్లి శ్రీనివాస్‌రావు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాజకీయంగా, సామాజికంగా, అన్ని రంగాల్లో మున్నూరుకాపులు అభివృద్ధి చెందే విధంగా మున్నూరుకాపు మహాసభ కృషి చేస్తుందన్నారు. తెలంగాణ మున్నూరుకాపు మహాసభ నూతన పాలక మండలి ప్రమాణ స్వీకారం జూన్ 1వ తేదీన మున్నూరుకాపు భవన్‌లో జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహాసభ ప్రతినిధులు దండు నరేందర్, చేపూరి వెంకటేశ్వర్‌రావు, అమరం శ్యాంకుమార్, ఏనుగుల హరీష్, తోట శంకర్, ఆకుల రాకేష్, అడ్వకేట్ అన్నపూర్ణ, బండారి జ్యోతి, కావేటి అజయ్‌కుమార్, గండు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నవాటిని వాడుకోనివ్వరు..

ఖాళీగా ఉన్నా పర్లేదు.. కానీ ఎవరూ వాడొద్దు..!

- కమ్యూనిటీహాల్‌లో ఉచిత ట్యూషన్ సెంటర్ అనుమతికి నిరాకరణ
- ఖాళీగా ఉంటూ నిరుపయోగమవుతున్న కమ్యూనిటీహాళ్లు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సామాజిక ప్రయోజనాల కోసం బస్తీలలో లక్షలాది రూపాయలతో నిర్మించిన సామాజిక భవనాలు సక్రమంగా సద్వినియోగం కాకపోవడంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాంనగర్ డివిజన్‌లోని అనేక ప్రాంతాలలో నిర్మించిన కమ్యూనిటీహాళ్లను సక్రమంగా వినియోగించడం లేదు. ఆయా బస్తీలలోని కమ్యూనిటీహాళ్లకు మొదటి అంతస్తు వరకు నిర్మించారు. అయితే అక్కడక్కడ గ్రౌండ్ ఫ్లోర్‌ను అంగన్‌వాడీ కేంద్రాలకు వినియోగించుకోగా మరికొన్ని చోట్ల వ్యాపారం కోసం వినియోగిస్తున్నారు. డివిజన్‌లో రాజీవ్ గాంధీ కమ్యూనిటీహాల్, అచ్చయ్యనగర్, పాలమూరిబస్తీ, సంజయ్‌నగర్ బస్తీ, ఎల్ఐజీ, సూర్యనగర్ బస్తీలలోని కమ్యూనిటీహాళ్లు సక్రమంగా వినియోగమవుతున్నాయ లేదా అనే పరిశీలించే నాథుడే కరువయ్యారు.

ఇదీ రాజీవ్‌గాంధీ కమ్యూనిటీహాల్ పరిస్థితి...

- ముఖ్యంగా బాగ్‌లింగంపల్లిలోని రాజీవ్‌గాంధీ కమ్యూనిటీహాల్‌ను గ్రౌండ్ ఫ్లోర్ జీహెచ్‌ఎంసీ వార్డ్ ఆఫీసుకు ఉపయోగిస్తున్నారు. గతంలో ఈ కార్యాలయాన్ని మాజీ కార్పొరేటర్ ప్రభాకర్‌రెడ్డి తన కార్యాలయానికి ఉపయోగించారు. అయితే సుమారు గత రెండేళ్ల నుంచి వార్డ్ ఆఫీసుగా జీహెచ్‌ఎంసీ వాడుకుంటోంది. మొదటి అంతస్తులో గతంలో కుట్టు మెషిన్ కేంద్రం నిర్వహించారు. ఆ కేంద్ర నిర్వహణ లోపంతో కుట్టు మెషిన్లను దొంగలు ఎత్తుకెళ్లినట్లు సమాచారం.
- సావిత్రిబాయి బాలల సంఘం నామమాత్రపు ఫీజు (రూ.100)తో పేదల విద్యార్థులకు ట్యూషన్ చెప్పించేందుకు జోనల్ కమిషనర్‌కు వినతి పత్రం సమర్పించింది.
- అయితే జోనల్ కమిషనర్ ట్యూషన్ నడుపుకొమని మౌఖికంగా వారికి చెప్పడంతో పాటు జీహెచ్‌ఎంసీ ఏఈ గీత, అసిస్టెంట్ ఏఈ శివను అక్కడకి పంపించి తగిన చర్యలు తీసుకొమని ఆదేశించారు. వారు అక్కడికి వచ్చి సామాజిక భవనాన్ని పరిశీలించారు. అయితే తరువాత డీఎంసీ రామాంజులరెడ్డి అక్కడికి వచ్చి 'మీకు ఎవరూ అనుమతించారు.?'అంటూ ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తూ ట్యూషన్‌సెంటర్ బ్యానర్‌ను తొలగించి సీజ్ చేశారు. జోనల్ కమిషనర్‌కు లెటర్ పెట్టామని చెప్పినప్పటికీ డీఎంసీ పట్టించుకోకుండా మీకు అనుమతి ఇవ్వను. ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి అని ఆగ్రహం వ్యక్తం చేశారని నిర్వాహకులు తెలిపారు.
- ఈ విషయాన్ని జోనల్ కమిషనర్‌ను కలిసి జరిగిన విషయాన్ని ప్రస్తావిస్తే తాను డీఎంసీకి చెబుతాను అని సమాధానం చెప్పారు. అయితే వేలాది రూపాయలు పెట్టలేని పేద విద్యార్థులకు ఉచితంగా ట్యూషన్ చెబుతామంటే అధికారులు సహకరించకపోవడం బాధాకరమని నిర్వాహకులు వాపోతున్నారు. ఇలాంటి మంచి కార్యక్రమాలకు కమ్యూనిటీహాల్ ఇవ్వకుంటే ఎలా అని వారు ప్రశ్నిస్తున్నారు.

ఖాళీగా ఉన్న కమ్యూనిటీహాళ్లు..

- ఇక ఈడబ్ల్యూఎస్ క్వార్టర్స్ కమ్యూనిటీ హాల్‌లోని గ్రౌండ్ ఫ్లోర్‌లో బస్తీ దావాఖానా నిర్వహిస్తున్నారు. ఫస్ట్‌ఫ్లోర్‌లో కొంత కాలం కుట్టు మెషిన్ కేంద్రానికి ఉపయోగించారు. ఆ తర్వాత ఖాళీగా ఉంది.
- పాలమూరి బస్తీలోని కమ్యూనిటీహాల్ గ్రౌండ్ ఫ్లోర్‌లో ఓ ప్రైవేట్ వ్యక్తులకు వాటర్ ప్యూరీఫైడ్ కోసం అనుమతించారు. మొదటి అంతస్తు నిరుపయోగంగా ఉంది.
- సంజయ్‌నగర్ బస్తీలోని కమ్యూనిటీహాల్ పూర్తిగా నిరుపయోగంగా ఉంది.
- అచ్చయ్యనగర్‌బస్తీలోని కమ్యూనిటీ హాల్ గ్రౌండ్ ఫ్లోర్‌లో అంగన్‌వాడీ కేంద్రాన్ని కేటాయించగా ఫస్ట్ ఫ్లోర్‌లో ఓ ప్రైవేట్ వ్యక్తి తన టెంట్ హౌస్, ఎలక్ట్రికల్‌కు సంబంధించిన వస్తువులను స్టోర్ రూంగా మార్చుకున్నాడు.
- సూర్యనగర్ బస్తీలోని కమ్యూనిటీహాల్‌లో బస్తీ దావాఖానా నిర్వహిస్తున్నారు. ఇలా అనేక బస్తీలలోని కమ్యూనిటీహాళ్లకు సంబంధించిన మొదటి అంతస్తులు కొంత మంది వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఉపయోగించడంతో పాటు మరికొన్ని చోట్ల నిరుపయోగంగా ఉంటున్నాయి.

వాడుకుంటే అడ్డుకుంటారు.?



బాగ్‌లింగంపల్లిలోని రాజీవ్‌గాంధీ నగర్ కమ్యూనిటీహాల్

వ్యాపారం అంటే ఎలా..?



ఎంతో గొప్ప ఆశయంతో సావిత్రిబాయి పూలే స్ఫూర్తితో ఈ సంస్థను స్థాపించాం. పేద విద్యార్థులకు ఉచితంగా ట్యూషన్ చెప్పాలని సంకల్పించాం. మా దగ్గర డిగ్రీ, బిటెక్ చేసిన విద్యార్థులు సామాజిక స్పృహతో ఉచితంగా చదువు చెప్పడానికి ముందుకు వస్తున్నారు. సంస్థ నిర్వహణ, చిన్న చిన్న ఖర్చుల కోసం, నామమాత్రంగా వంద రూపాయల ఫీజు తీసుకుంటున్నాం. దీనిని కూడా అధికారులు వ్యాపారం అంటే ఎలా.?

– జగదీష్, సావిత్రిబాయి బాలల సంఘం ప్రతినిధి

స్పందించకపోతే ఎలా.?



మా బస్తీలోని పేద పిల్లలకు ఉచితంగా ట్యూషన్ చెబుతామని వచ్చారు. జోనల్ కమిషనర్‌కు లెటర్ అందజేసి మౌకికంగా అనుమతి తీసుకున్నాం. డీఎంసీ వచ్చి మీకు ఎవరు అనుమతి ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ సీజ్ చేశారు. మళ్లీ అతడికి కూడా వినతి పత్రం సమర్పించినా కనికరించలేదు. మేము ఎమైనా వ్యాపారం చేసుకోవడానికి అడిగమా.? పేద పిల్లల చదువు కోసమే కదా అడిగింది. నిరుపయోగంగా ఉందనే కదా మేము అడిగింది. ఎమ్మెల్యే కూడా స్పందించకపోతే ఎలా.?

– సాబేర్, బస్తీ అధ్యక్షుడు

దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నా..



ఈదమ్మ ఆలయం పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పావని

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్‌లో దేవాలయాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తున్నానని కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం గాంధీనగర్ డివిజన్‌లోని ధోబీఘాట్‌లో చేపడుతున్న ఈదమ్మ దేవాలయం పునర్ నిర్మాణ పనులను ఆమె పరిశీలించి మాట్లాడారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు ఫ్లోరింగ్‌కు కావాల్సిన బండలు, టైల్స్‌తో పాటు నిర్మాణ సామగ్రిని సమకూరుస్తానని హామీ ఇచ్చారు. డివిజన్‌లోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వినయ్‌కుమార్, ఎం.ఉమేష్, శ్రీకాంత్, సత్తిరెడ్డి, శివకుమార్, ఆనంద్‌రావు, జ్ఞానేశ్వర్, బస్తీవాసులు నగేష్, వెంకటేష్, సాయికిరణ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టండి

సికింద్రాబాద్ జోనల్ కమిషనర్‌కు కార్పొరేటర్ల విజ్ఞప్తి



జోనల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్లు ఉమా, వై.అమృత, లావణ్య, పద్మ

కాచిగూడ: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అంబర్‌పేట నియోజకవర్గానికి చెందిన పలువురు కార్పొరేటర్లు శుక్రవారం సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. సికింద్రాబాద్ జోనల్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో కార్పొరేటర్లు వారి డివిజన్లలో నెలకొన్న సమస్యలను జెడ్‌సీ దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా సీసీ రోడ్లు, స్ట్రీట్ లైట్లు, నాలాల్లో పూడికతీత, క్లీన్‌అండ్‌గ్రీన్ తదితర సమస్యలపై స్థానిక అధికారులు దృష్టిపెట్టేలా చూడాలని కోరారు. సమస్యలను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకుంటామని జెడ్‌సీ వారికి హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో కాచిగూడ, బాగ్‌అంబర్‌పేట, గోల్నాక, నల్లకుంట, అంబర్‌పేట, హిమాయత్‌నగర్ డివిజన్ల కార్పొరేటర్లు ఉమా రమేష్‌యాదవ్, పద్మ వెంకట్‌రెడ్డి, లావణ్య శ్రీనివాస్‌గౌడ్, వై.అమృత, విజయ్‌కుమార్‌గౌడ్, మహాలక్ష్మి రామన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పౌర హక్కులకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు

హిమాయత్‌నగర్ తహసీల్దార్ డి.సంధ్యారాణి



నెహ్రూనగర్ బస్తీలో పౌర హక్కులపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్

కాచిగూడ: హిమాయత్‌నగర్ తహసీల్ పరిధిలోని మురికవాడలు, బస్తీల్లో ప్రతినెలా పౌర హక్కులపై విస్తృతంగా అవగాహన కల్పించేందుకు అధికార యంత్రాంగం నిర్ణయం తీసుకుందని హిమాయత్‌నగర్ తహసీల్దార్ డి.సంధ్యారాణి తెలిపారు. ఇప్పటికే మండల పరిధిలోని పలు బస్తీల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. శుక్రవారం మోతీలాల్ నెహ్రూనగర్ బస్తీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమెతో పాటు కార్పొరేటర్ ఉమారాణి పాల్గొని మాట్లాడారు. పౌర హక్కులకు భంగం కలిగిస్తే చట్టరీత్యా కఠినంగా చర్యలు చేపడతామని అన్నారు. జరిమానాలతో పాటు శిక్ష విధించేందుకు అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ అధికారి శాంతి, జలమండలి ఏఈ భావన, విఆర్‌ఓ మధు, సంజయ్, శీర్‌సాగర్, మురళి తదితరులు పాల్గొన్నారు.

జాబ్ కేలండర్ ప్రకారం నోటిఫికేషన్లు ప్రకటించాలి

నిరుద్యోగుల మహాధర్నాలో ఎంపీ ఆర్.కృష్ణయ్య



కవాడిగూడ: ఎన్నికల మేనిఫెస్టోలో నిరుద్యోగులకు ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని ఎంపీ ఆర్ కృష్ణయ్య ఆరోపించారు. నిరుద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం వారు చేసే ప్రతి పోరాటంలో బీసీ సంక్షేమ సంఘం సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. జాబ్ కేలండర్ ప్రకారంగా విడుదల చేయాల్సిన 13నోటిఫికేన్లను జూన్ 2లోపు విడుదల చేయాలనే డిమాండ్‌తో తెలంగాణ నిరుద్యోగ జేఏసీ శుక్రవారం ఇందిరా పార్కు ధర్నాచౌక్ వద్ద మహాధర్నా చేపట్టారు.

- ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ... కొత్తగా ఏర్పడ్డజిల్లాలు, మండలాలు మున్సిపాలిటీలకు ఒక్కో పోస్టును కూడా మంజూరు చేయలేదని ఆయన ఆరోపించారు. కొత్తగా ఏర్పడ్డ పోస్టులలో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ కోటాను లెక్కించి గ్రూప్–1 యాభై శాతం, గ్రూప్–2లో 30 నుంచి 40 శాతం డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ కోటాలో ఎన్ని పోస్టులు వస్తాయో పూర్తి స్థాయిలో లెక్కించి భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి 2లక్షల ఉద్యోగాలు భర్తీ చేయడానికి చర్యలు తీసుకుంటామని చెప్పడాన్ని స్వాగతిస్తున్నామని అన్నారు. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ కోటా కింద భర్తీ చేయాల్సిన గ్రూప్ 1, 2, 3, 4 సర్వీసు ఉద్యోగాలను పూర్తి స్థాయిలో లెక్కించి భర్తీ చేయడానికి ఆర్థిక శాఖకు ఇప్పటికి ప్రతిపాదనలు పంపకపోవడం సరికాదన్నారు.
- తెలంగాణ నిరుద్యోగ జేఏసీ చైర్మన్ మోతీలాల్ నాయక్ మాట్లాడుతూ.. నామమాత్రంగా డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ పోస్టుల కోటాను లెక్కించి ఆర్థిక శాఖకు ప్రతిపాదనలు పంపడమంటే నిరుద్యోగులను మోసం చేయడమేనని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించి జాబ్ కేలండర్ ప్రకారం ఉద్యోగ నోటిఫికేషన్ విడుల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. జేఏసీ చైర్మన్ మోతీలాల్ నాయక్ ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో ప్రసన్న హరికృష్ణ, సీనియర్ జర్నలిస్టులు విఠల్, రఘు, తెలంగాణ క్రాంతి దళ్ వ్యవస్థాపకులు పృథ్వీ, బీసీ నాయకులు అనంతయ్య, వేముల రామకృష్ణ, జేఏసీ నాయకులు జనార్దన్, వందలాది మంది నిరుద్యోగులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో ఏడీఈ నాగేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. నారాయణగూడ ఫీడర్ పరిధిలోని నారాయణగూడ వాటర్ వర్క్స్, సూర్యనగర్, నెహ్రూనగర్, ఆరోరా కాలేజ్, మానస ఎన్‌క్లేవ్, ఈడబ్ల్యూఎస్ క్వార్టర్స్ తదితర ప్రాంతాల్లో ఉదయం 10గంటల నుంచి 11గంటల వరకు... 44 బస్టాప్ ఫీడర్ పరిధిలోని ఓల్డ్ రామాలయం, ఫిష్‌మార్కెట్, అంజయ్యనాలా, ఫ్రెండ్స్ కాలనీ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి 4గంటల వరకు.. దుర్గాభాయ్ దేశ్‌ముఖ్ ఫీడర్ పరిధిలోని ఇండస్ట్రీయల్, ఈడీహెచ్, విజ్ఞానపురికాలనీ, వీఎస్‌టీ మెయిన్‌రోడ్, దయానంద్‌నగర్, ఎస్‌ఆర్టీ క్వార్టర్స్ తదితర ప్రాంతాల్లో సాయంత్రం 4గంటల నుంచి 5గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు తెలిపారు.

నేడు ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం

ముషీరాబాద్: ప్రపంచ పొగాకు వ్యతిరేక దినాన్ని పురస్కరించుకుని శనివారం ముషీరాబాద్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఆస్పత్రి వైద్యాధికారి డా. మనోజ్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ధూమపానం వల్ల స్ట్రోక్, గుండె సమస్యలు, కేన్సర్, శ్వాస సంబంధిత సమస్యలు వస్తాయని అన్నారు. ధూమపానం మితిమీరితే ప్రాణాలు పోయే పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు

కాచిగూడ: హైడ్రాలో పనిచేస్తున్న 300 మందిని జీహెచ్‌ఎంసీకి బదిల చేయడం పట్ల జీహెచ్‌ఎంసీ ఔట్ సోర్సింగ్ కార్మిక సంఘం అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. 1578 మందికి కారుణ్య నియామకాలకు ప్రభుత్వం ఆర్డర్ ఇవ్వడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి జీహెచ్‌ఎంసీ ఔట్‌సోర్సింగ్ కార్మికుల తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. అదే విధంగా ప్రతి క్షణం తమ వెన్నంటి ఉండి కార్మికుల సమస్యల పరిష్కారినికి కృషి చేస్తున్న టీజేఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ఎం.కోదండరామ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

వినయ్‌కుమార్‌కు అభినందనలు

కాచిగూడ: సంవిధాన్ బచావో కార్యక్రమ కమిటీ (రాజ్యాంగ పరిరక్షణ కమిటీ) చైర్మన్‌గా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు డాక్టర్ పుంజాల వినయ్‌కుమార్ నియమితులు అయ్యారు. ఈ సందర్భంగా మున్నూరుకాపు ఐక్య పోరాట సమితి అధ్యక్షుడు కొండూరు వినోద్‌కుమార్, ఉపాధ్యక్షుడు పుంజాల దత్తుమూర్తి, ప్రధానకార్యదర్శి కట్టెల సుభాష్ శుక్రవారం ఆయనను కలిసి అభినందనలు తెలియజేశారు.

బీసీ రిజర్వేషన్లు అమలైన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి

కాచిగూడ: స్థానిక సంస్థల్లో 42శాతం బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రిజర్వేషన్లు పెంచకుండా ఎన్నికలకు వెళ్తే కాంగ్రెస్ పార్టీని భూస్థాపితం చేస్తామని ఆయన హెచ్చరించారు. బీసీ కుల సంఘాల ఐక్యవేదిక అంబర్‌పేట అధ్యక్షుడు పెండ్యాల వెంకట్ ఆధ్వర్యంలో శుక్రవారం నింబోలిఅడ్డలోని సంఘం కార్యాలయంలో రాజేందర్‌పటేల్‌గౌడ్‌ను సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో బీసీలకు అవకాశం కల్పించాలన్నారు. బీసీలను ఓటు బ్యాంక్‌గా వాడుకుంటూ నిర్లక్ష్యం చేస్తున్న పార్టీలకు వచ్చే ఎన్నికల్లో బీసీలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో బి.కృష్ణాగౌడ్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అహల్యాబాయి జయంతి శోభాయాత్ర



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్

ముషీరాబాద్: పుణ్యశ్లోక, రాజమాత అహల్యాబాయి హోల్కర్ 300వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని శనివారం సాయంత్రం 4గంటలకు కవాడిగూడ ప్రధాన రోడ్డులోని సీజీవో టవర్స్ నుంచి శోభాయాత్ర నిర్వహించనున్నట్లు ముషీరాబాద్ నియోజకవర్గం బీజేపీ మీడియా సెల్ ఇన్‌చార్జి, కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం ముషీరాబాద్ బీజేపీ వార్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్యనాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ శోభాయాత్ర కార్యక్రమానికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్, మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి, మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి, బీజేపీ ముషీరాబాద్ జిల్లా అధ్యక్షులు భరత్‌గౌడ్ తదితరులు హాజరవుతారని అన్నారు. ఈ శోభాయాత్రను విజయవంతం చేసేందుకు బీజేపీ నాయకులు పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు. ఈ సమావేశంలో అహల్యాబాయి హోల్కర్ జయంతి ఉత్సవ సమితి జిల్లా కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, సహాయ కన్వీనర్ శారదా, అనిత, ముషీరాబాద్, భోలక్‌పూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కంచిముదిరాజ్, రాజశేఖర్, కలకోట అరుణ్‌కుమార్ తదితరులున్నారు.

తొలితరం వ్యంగ్య రచయిత మునిమాణిక్యం నరసింహారావు



మునిమాణిక్యం నరసింహారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జనార్దనమూర్తి, త్రినాథరావు

చిక్కడపల్లి: మొదటి సామాజిక మత సంస్కరణ ఉద్యమకర్త మునిమాణిక్యం నరసింహారావు యాదిలో... శీర్షికతో ప్రత్యేక కార్యక్రమాన్ని శుక్రవారం త్యాగరాయ గానసభలో నిర్వహించారు. ఈ సందర్భంగా గానసభ అధ్యక్షుడు కళా జనార్దనామూర్తి అధ్యక్ష ఉపన్యాసం చేశారు. తొలితరం వ్యంగ్య హాస్య రచయిత మునిమాక్యం నరసింహారావు అని కొనియాడారు. ఆయన రాసిన కాంతం కథలు ప్రతి కుటుంబంలో జరిగే సంఘటనలతో సున్నిత హాస్యాన్ని అందించారని తెలిపారు. ఆయన రచించిన వితండ వాదాలు ప్రతి ఒక్కరూ చదివి లోకం పోకడలను తెలుసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు సీహెచ్ త్రినాథరావు, బండి శ్రీనివాస్, జై హింద్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.


'శ్రమ జీవన కెరటం' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మృతి చెందిన కార్మికుల కుటుంబీకులతో కామల్లా ఐలన్న

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, తెలంగాణ ఉద్యమ నేత కామల్లా ఐలన్న రచించిన 'శ్రమ జీవన కెరటం'పుస్తకాన్ని శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆకాల మరణం పొందిన కార్మిక కుటుంబాలచే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కామల్లా ఐలన్న మాట్లాడుతూ.. కార్మికుల సంక్షేమం కోసం 1996 చట్టం వచ్చిందంటే అమరత్వం పొందిన కార్మికుల త్యాగ ఫలితమేనని అన్నారు. 20 ఏళ్లుగా కార్మిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఓయూ ఉద్యమ నేత నలిగంటి శరత్,భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి ఉప్పు సాయికుమార్, కోశాధికారి తాటికొండ మధు,ప్రచార కార్యదర్శి వేముల కొండ సంపత్, ఉపాధ్యక్షులు ఎస్‌కె అలీ, పిల్లి హరిశ్చంద్రతోపాటు వివిధ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

'దేశంలో దళితులపై దాడులు పెరిగిపోతున్నాయి'



నిరసన తెలుపుతున్న స్ట్రగుల్ ఫర్ జస్టిస్ ప్రతినిధులు

కవాడిగూడ: దేశంలో బీజేపీ అధికాంలోకి వచ్చిన నాటి నుంచి దళితులపై రోజురోజుకు దాడులు, వివక్ష పెరిగిపోతోందని స్ట్రగుల్ ఫర్ జస్టిస్ సంస్థ వ్యవస్థాక అధ్యక్షుడు మాస్త దయానంద్ ఆరోపించారు. మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్ హైకోర్టు ఎదురుగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటును బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్, మనువాదులు అడ్డుకోవడాన్ని నిరసిస్తూ శుక్రవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దయానంద మాట్లాడుతూ.. గుజరాత్, రాజస్థాన్, ఉత్తర్‌ప్రదేశ్‌తో పాటు బీజేపీ పాలిత ప్రాంతాల్లో దళితుల పట్ల వివక్ష అధికంగా ఉందన్నారు. ముఖ్యంగా కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్న ఏపీలో దళితులపై ప్రతిరోజు ఏదో ఒక చోట దాడులు జరగడం దుర్మార్గమని అన్నారు. తెలంగాణలో దళిత ప్రజాప్రతినిధులకు కాంగ్రెస్ ప్రభుత్వం అవమానపరిచే విధంగా వ్యవహరిస్తోందని అన్నారు. విద్యార్థి జేమ్స్‌పై అగ్రవర్ణాల దాడిని మరువక ముందే తెనాలిలో దళిత యువకులపై బహిరంగా థర్డ్ డిగ్రీని అమలు చేయడాన్ని ఖండిస్తున్నామని అన్నారు. ఇటీవల తెలంగాణలో జరిగిన సరస్వతి పుష్కరాలలో ఎంపీస్థాయి వ్యక్తే కుల వివక్షకు గురైతే రాష్ట్రంలో సామాన్య దళితుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు సర్వేట్ట మల్లేష్, కె.లలిత, వెంకటేష్, రమేష్, రాజు, సదానందం, రాణి తదితరులు పాల్గొన్నారు.